ఈ-పంట.. నమోదు ఎప్పుడంట..!

- స్పష్టత ఇవ్వని వ్యవసాయ శాఖ
- క్లస్టర్ పరిధిలో 70 శాతం ఖరీఫ్ వరినాట్లు పూర్తి
- సాధారణ సాగు విస్తీర్ణం 1.01 లక్షల ఎకరాలు


రాయవరం మండలం సోమేశ్వరం గ్రామ పరిధిలో వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

రాయవరం: ఖరీఫ్ సాగులో రైతులు తలమునకలయ్యారు. వాతావరణం కూడా సహకరించడం, అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సాగును ముమ్మరం చేశారు. ఏటా పంటల సాగు సమయంలో ఈ-క్రాప్ నమోదు చేస్తారు.అయితే ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటి వరకూ ఈ పంట నమోదును వ్యవసాయ శాఖ ప్రారంభించలేదు. ఈ క్రాప్ నమోదుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట నమోదు కాకుంటే ప్రభుత్వ రాయితీలు, విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని వారి బెంగ. దీనిపై స్థానికంగా ఉండే వ్యవసాయ సిబ్బందిని ఆరా తీస్తున్నారు. వారి నుంచి స్పష్టమైన సమాధానం లేకపోవడంతో ఈ-క్రాప్ నమోదు ఉంటుందా? లేదా? అనే సందిగ్ధంలో రైతులు ఉన్నారు. పంట సాగుకు ఎరువులు కావాలన్నా, పంటను విక్రయించుకోవాలన్నా, పంట నష్టం జరిగినపుడు పంటల బీమా సాయం పొందాలన్నా ఈ-క్రాప్ ఉపయోగ పడుతుంది. ఇంతటి ప్రాధాన్యమున్న పంటల నమోదు కార్యక్రమం ఎప్పుడు ప్రారంభమవుతుందా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో జూన్ మాసాంతంలోనే ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాగా, ప్రస్తుతం నేటికీ ప్రారంభం కాకపోవడం గమనార్హం.

ఈ-క్రాప్ ఆధారంగానే

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2019 నుంచి 2023 వరకూ ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసేది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభమైన వెంటనే ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించేది. గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ ప్రక్రియను నిర్వహించేవారు. పంట సాగు చేసిన రైతులను పొలం వద్ద నిలబెట్టి పంటతో పాటు ఫొటో తీసి యాప్‌లో వివరాలు నమోదు చేసేవారు. ఈ-క్రాప్ ఆధారంగానే ఎరువులు, ఇతర సాగుసాయాన్ని వ్యవసాయ సిబ్బంది అందించేవారు. రైతులు పండించిన పంటను కూడా ఈ క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది.

ఈ-పంట నమోదుతో ప్రయోజనాలు

పంటల బీమా వర్తిస్తుంది. పంట రుణం మంజూరవుతుంది. ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుతుంది. పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు. పంటను కూడా ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది.

క్లస్టర్ పరిధిలో ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	సాగుగ్రామాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఆర్‌సీపీఎం	25	18,806	9,737
కె.గంగవరం	26	15,633	8,700
కాజులూరు	26	19,382	17,200
మండపేట	12	16,985	11,042
రాయవరం	12	14,646	12,002
కపిలేశ్వరపురం	19	16,333	7,200
మొత్తం	120	1,01,785	65,881

క్లస్టర్ పరిధిలో ఖరీఫ్ సాగు ఇలా

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లోని 120 గ్రామాల్లో 1.01 లక్షల ఎకరాల్లో సుమారు 65,851 మంది రైతులు, కౌలుదారులు ఖరీఫ్ వరిసాగు చేపడుతున్నారు. క్లస్టర్ పరిధిలో ఇప్పటికే 70 శాతం మేర వరినాట్లు పూర్తయ్యాయి. 60 శాతం మంది రైతులు వెదజల్లు విధానంలో సాగు చేస్తుండగా, మిగిలిన 40 శాతం మంది రైతులు సాధారణ పద్ధతిలో నాట్లు వేస్తున్నారు. సాధారణ వరినాట్లలో అధికంగా బెంగాలీ కూలీలు, వలస కూలీలతో నాట్లు వేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో 75 శాతం ఎంటీయు 7029 (స్వర్ణ), 20 శాతం ఎంటీయూ 1318 రకాలను సాగు చేస్తుండగా, ఐదు శాతం ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1121 (విత్తనాల కోసం), అలాగే ఎంటీయూ 1064 తదితర రకాలను సాగు చేస్తున్నారు.


గతేడాది ఈ-క్రాప్ చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది (ఫైల్)

మార్గదర్శకాలు వచ్చిన వెంటనే..



ఈ-క్రాప్ నమోదుకు మార్గదర్శకాలు రావాల్సి ఉంది. యాప్‌ను మరింత సమర్థవంతంగా వినియోగించే క్రమంలో భాగంగానే యాప్‌ను అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ పంట నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు రాగానే పంట నమోదుకు చర్యలు తీసుకుంటాం.

– కొప్పిశెట్టి ప్రభాకర్, ఏవో, రాయవరం

అంబులెన్స్ అందుబాటులో ఉంచాలి

కాజులూరు: 108 అంబులెన్స్ వాహనాన్ని మండల కేంద్రంలో అందుబాటులో ఉంచాలని రామచంద్రపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దూడల శంకర నారాయణమూర్తి అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్ వాహనం గొల్లపాలెం పీహెచ్‌సీలో ఉంచుతున్నారన్నారు. మండల గ్రామాలకు మధ్యలో ఉన్న కాజులూరులో 108 అంబులెన్స్ వాహనాన్ని ఉంచటం వలన అత్యవసర సమయాల్లో అన్ని గ్రామాలకు అందుబాటులో ఉన్నట్లవుతుందన్నారు. ఉద్యోగుల సౌలభ్యం కోసం వాహనాన్ని గొల్లపాలెంలో ఉంచుతున్నారని ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశామన్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి పోరాటం

కాజులూరు: రైతు సమస్యల పరిష్కారానికి నిరంతరం ఏపీ రైతుసంఘం, ఏపీ కౌలురైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం సమష్టిగా పోరాటాలు చేస్తున్నామని ఏపీ కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మండలంలోని కాజులూరులో మంగళవారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లోపించిందన్నారు. ప్రభుత్వ తీరును ప్రతిఘటిస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో జిల్లా, మండల స్థాయి అధికారులకు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలు సమర్పించాలని సంఘాల జిల్లా సమావేశంలో తీర్మానించామన్నారు. కార్యక్రమాలకు రైతులు తమ వంతు సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, పలువురు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం


సుభద్రాపురంలో పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు గ్రామ శివారు సుభద్రాపురంలో జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాగు నీరు పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇంటింటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులను ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో సర్పంచ్ దాయం కావేరి, ఎంపీటీసీ సభ్యురాలు టేకి సత్యమంజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజశ్విని పరిశీలించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ


విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న సర్పంచ్, ఎంఈఓ

కపిలేశ్వరపురం: స్థానిక దేవీ సెంటర్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంఈఓ కె.తాతారావు చేతుల మీదుగా మంగళవారం స్టూడెంట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను పేద, మధ్య తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అగస్త్యేశ్వరరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీఠంలో నేడు తొలి ఏకాదశి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. తొలి ఏకాదశిని పురస్కరించుకుని పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నామన్నారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని వెదురుపాక, రాయవరం, సోమేశ్వరం, వెంటూరు, పసలపూడి తదితర గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు ఏర్పాటు చేశాయి.

నేడు వేణుగోపాలస్వామి ఆలయంలో ..

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి పూజ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి) నుంచి 12 ఏకాదశుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం నుంచి డిసెంబర్ 26 వరకూ ప్రతి ఏకాదశి రోజున పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

28 నుంచి అశిరాంబ జాతర


అశిరాంబ అమ్మవారు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామదేవత అశిరాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. అమ్మవారి జాతరను అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. దూర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామ ఆడపడుచులు జాతరకు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. 28న పెద్ద జాతర, 29న ఆలయం వద్ద తీర్థం 30న నైవేద్య సమర్పణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా హెచ్‌పీ గ్యాస్ స్వర్ణోత్సవ మేళా

కొత్తపేట: హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ) గ్యాస్ ఫౌండేషన్ స్వర్ణోత్సవాన్ని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌పీ గ్యాస్ సరఫరా ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మెగా డిస్కౌంట్ మేళా కార్యక్రమాన్ని మండలంలోని వానపల్లి పీఏసీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్ బండారు వీరవెంకటసత్యనారాయణ (సతీష్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వినియోగదారులు అతిథులుగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ ఏజెన్సీ ద్వారా కొత్తపేట, పి.గన్నవరం, అయినవిల్లి మండలాల్లో సుమారు 25 వేల మంది వినియోగదారులు ఉన్నారన్నారు.

కలెక్టర్‌తో ఏపీఎన్‌జీఓ నేతల భేటీ


జిల్లా కలెక్టర్‌తో ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు

కపిలేశ్వరపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్‌కుమార్ రవిరాలను మంగళవారం అమలాపురంలోని తన కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవో నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.వెంకటకృష్ణ, రాష్ట్ర పారా మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, నాయకులు సీహెచ్ రాజశేఖర్ మోటూరి రామారావు, డి.సుబ్రహ్మణ్యం, చిక్కాల సూర్యారావు కలిసినట్టు మండపేట యూనిట్ అధ్యక్షులు జుత్తుగ మల్లిఖార్జునుడు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను కలెక్టర్‌కు విన్నవించినట్టు తెలిపారు.

అల్లవరం పీరుకు హిందువుల పూజలు


మామిడికుదురులో అల్లవరం పీరుకు పూజలు చేస్తున్న హిందువులు

మామిడికుదురు: త్యాగాలకు ప్రతీకగా నిలిచే మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా అల్లవరం నుంచి వచ్చిన పీరుకు మంగళవారం హిందువులు మొక్కులు చెల్లించి మత సామరస్యాన్ని చాటుకున్నారు. పీరును దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఏటా మొహర్రం సంతాప దినాల్లో అల్లవరం నుంచి పీరును తీసుకువచ్చి నగరం, మామిడికుదురు పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. దానిలో భాగంగా అల్లవరం నుంచి తీసుకువచ్చిన పీరును తిరిగి తీసుకువెళ్లే క్రమంలో హిందువులు ఈ పీరును దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా మొహర్రం సంతాప దినాల్లో భాగంగా నగరం గ్రామంలోని పలు పంజాల నుంచి పీర్లను తీసి ఊరేగించారు. కర్బలా యుద్ధంలో అసువులు బాసిన హజరత్ అబ్బాస్‌కు ఘనంగా నివాళులర్పించారు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించి రక్తం చిందించారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వయ్యారి భామ.. రైతుకు శ్రమ..


అంబాజీపేటలోని కొబ్బరితోటలో ఉధృతంగా పెరిగిన వయ్యారిభామ మొక్కలు

- సమస్యాత్మక కలుపు మొక్క విస్తరణ
- పంటలకు సోకుతున్న చీడపీడలు

అంబాజీపేట: సమస్యాత్మక కలుపు మొక్కగా మారిన వయ్యారి భామ విస్తారంగా వ్యాపిస్తోంది. రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఒక హానికరమైన కలుపుమొక్క అయిన దీనిని కాంగ్రెస్ గడ్డి, నక్షత్ర గడ్డి, మంగమ్మ చెట్టు అని పిలుస్తారు. దీనిని నివారించేందుకు ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి, తిరుపతిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వారు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. వయ్యారి భామను నిర్మూలిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కలుపు మొక్కను సామూహికంగా నిర్మూలించకపోతే రైతులకు తీరని నష్టం చేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక్కో మొక్క 10 వేల నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. వరి పంట పొలాలు, కొబ్బరి తోటలు, పూల తోటలు, రహదారి వెంబడి, జన వాసాల చుట్టూ, విస్తారంగా పెరుగుతోంది. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల్లో సాగు చేస్తున్న కొబ్బరి తోటలు, వరి పంట పొలాలు, కూరపాదుల్లోను వేల ఎకరాల్లో ఈ వయ్యారి భామ ఉధృతి అధికంగా ఉంది.

కలిగే నష్టాలెన్నో...

పంట పొలాల్లో 40 శాతం, పశుగ్రాసం పంటలలో 90 శాతం దిగుబడిని ఈ వయ్యారి భామ తగ్గిస్తుంది. పార్థీనియం కొన్ని రకాల వైరస్‌లకు ఆశ్రయమిస్తూ వివిధ పంటల్లో వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడానికి కారణమవుతుంది. మనుషుల్లో డెర్మటైటిస్, ఎగ్జిమా, తీవ్ర జ్వరం, ఉబ్బసం, బ్రాంకై టిస్, పుష్పాల పుప్పొడితో జలుబు, కళ్లు ఎర్రబడటం, కనురెప్పలు వాచడం మొదలైన ఆరోగ్య సమస్యలు వస్తాయి. పశువులలో వెంటుకలు రాలిపోవడం, హైపర్‌టెన్షన్‌కు గురికావడం జరుగుతుంది.

నివారణ పద్ధతులు

మొక్కలు పూతకు రాకముందే చేతులకు తొడుగులు ధరించి పీకి వేసి తగులబెట్టాలి. జైగోగ్రామా, బైకొలరేటా పురుగులను ఉపయోగించి జీవనియంత్రణ ద్వారా ఈ మొక్కలను నిర్మూలించవచ్చు. ఆయా పంటలలో సంబంధిత కలుపు నాశినిలను ఉపయోగించి నివారించవచ్చని శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సామూహిక నిర్మూలన చేపట్టాలి



వర్షాకాలంలో వయ్యారి భామ అధికంగా వచ్చే అవకాశం ఉంది. సామాజిక ఆరోగ్య భద్రత దృష్ట్యా పార్థీనియం వంటి సమస్యాత్మక కలుపు మొక్కలను సమర్థంగా నిర్మూలించడం అవసరం. కొబ్బరి తోటలు, ఇంతర పంటల్లో తెల్లదోమ, పిండినల్లి, తామర పురుగులను వయ్యారి భామ మొక్క ఎక్కువగా తయారు చేస్తుంది. ఈ మొక్క నుంచిగింజలు, పువ్వు తయారు కాకుండా ముందస్తుగా కత్తిరించడం వల్ల వయ్యారి భామను అరికట్టవచ్చు.

– వి.గోవర్ధనరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త, అంబాజీపేట

విజయమోహన్‌కు మోడరన్ ప్రజాహిత పురస్కారం

రామచంద్రపురం: ఆంధ్రా యూనివర్సిటీ దూర విద్య విభాగం డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.విజయ్‌మోహన్‌కి ప్రతిష్టాత్మక మోడరన్ ఫౌండేషన్ వారి ప్రజాహిత పురస్కారాన్ని మంగళవారం మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు అందజేశారు. ఈ మేరకు జీవీ రావు మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఏయూ దూర విద్యా విభాగం కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించినట్లు తెలిపారు. డైరెక్టర్ విజయమోహన్ నేతృత్వంలో ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్యా విభాగం మరింత విశేషమైన సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మోడరన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

ఆలమూరు: నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపును ఏర్పాటు చేసుకుని మద్యాన్ని విక్రయిస్తున్న దొంతంశెట్టి శివ లింగేశ్వరరావును ఆలమూరు ఎస్ఈబీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సీహెచ్ సత్యవేణి కథనం ప్రకారం మండపేట మండలంలోని గొల్లపుంతలో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి అధిక ధరకు విక్రయాలకు పాల్పడుతున్నారన్న సమాచారంతో ఎస్ఈబీ పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నిందితుడు శివ లింగేశ్వరరావు వద్ద నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ సత్యవేణి కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలమూరు ఎస్ఈబీ పరిధిలో సారా తయారు చేసిన, విక్రయించినా, బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసిన చర్యలు తప్పవన్నారు. అలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సత్వరమే ఎస్ఈబీకి సమాచారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలి

అంబాజీపేట: నిర్దేశించిన సమయంలో వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. మాచవరంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను, నీటిని నిలువ చేసే ప్రాంతాల వద్ద నీటి నమూనాలను సర్పంచ్ శాంతకుమారి పర్యవేక్షణలో మంగళవారం సేకరించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

115 మందికి వైద్య సేవలు

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ పంచాయతీ వద్ద మంగళవారం 104 ద్వారా ఉచిత వైద్య సేవలందించారు. నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత ఆధ్వర్యంలో సుమారు 115 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వర్షాకాలం సీజన్‌లో డయేరియాతో పాటు ఇతర వ్యాధులు కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉందని డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమాభారతి పాల్గొన్నారు.

మొగలిపాలెం, శీల లింక్ రోడ్డు అభివృద్ధి చేయాలి


కుంగిపోయి గోతులతో అధ్వానంగా మారిన మొగలిపాలెం, శీల లింక్ మార్గం

కాజులూరు: మండలంలోని మొగలిపాలెం, శీల గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్డు శిథిలావస్థకు చేరుకుని అధ్వానంగా తయారైంది. కోరంగి కెనాల్ నుంచి శలపాక చానల్ కాలువ గట్టును ఆనుకుని ఉన్న ఈ రోడ్డును గత 14 సంవత్సరాల క్రితం ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రావెల్ మట్టి వేసి అభివృద్ధి చేశారు. నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల లోపం కారణంగా నిర్మించిన ఏడాదికే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రహదారి మధ్యలో పలు చోట్ల పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో ట్రాక్టర్, ఆటో వంటి వాహనాలతో పాటు సైకిల్, మోటార్ సైకిల్ వంటి వాహనాలు సైతం ప్రయాణించేందుకు వీలు లేకుండా పోయింది. మండలంలోని శీలలంక, ఒంటితాడి, శీల, మంజేరు గ్రామాల ప్రజలు మొగలిపాలెం మీదుగా గొల్లపాలెం, కాకినాడ చేరుకునేందుకు ఈ లింక్‌రోడ్డు దగ్గర మార్గంగా ఉంటుంది. రోడ్డు పొడవునా నిలువెత్తు గోతుల ఏర్పడి ప్రమాదం భరితంగా మారిందని దీంతో వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా పోతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విపరీతంగా పెరిగిపోయిన గుర్రపు డెక్క


గుర్రపు డెక్కతో మూసుకు పోయిన కదలి చానల్

మామిడికుదురు: తాటిపాక ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని పంట కాలువల్లో విపరీతంగా పెరిగిపోయిన తూడు, గుర్రపు డెక్కతో సాగునీటి సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో ఖరీఫ్ సాగులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎంతో కాలం నుంచి గుర్రపు డెక్క, తూడు తొలగించమని డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా మానేపల్లి చానల్, కదలి చానళ్ల పరిస్థితి దారుణంగా ఉంది. కాలువల పరిస్థితిపై రైతులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. కాగా ఈ రెండు పంట కాలువల ఆధునీకరణకు నామమాత్రంగా రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. కదలి చానల్ పరిధిలో ఈదరాడ, గెద్దాడ, పొన్నమండ, కాట్రేనిపాడు తదితర గ్రామాలకు చెందిన ఆరు బ్రాంచ్ కాలువల పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల మేర కాలువల్లో పెరిగిపోయిన తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. మానేపల్లి ఛానల్ పరిధిలో ఆరు బ్రాంచ్ కాలువలకు చెందిన 14 కిలో మీటర్ల మేర పంట కాలువల అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరయ్యాయి కానీ ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. దీనిపై తాటిపాక ఇరిగేషన్ ఏఈ సుందర్‌సింగ్‌ను వివరణ కోరగా పనుల నిర్వహణకు టెండర్లు ఖరారయ్యాయని, రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షలు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్షిత మంచినీరు అందించేందుకు నీటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుత వాతావరణంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు సంబంధించి జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సెంట్రల్ టీమ్ పర్యవేక్షణలో మంగళవారం పసుపల్లిలో నీటి పరీక్షలు నిర్వహించారు. టీమ్ కో ఆర్డినేటర్ డి.రాజేష్, సభ్యులు ఎం.లక్ష్మి, టి.సత్యవాణిల ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షలను నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంకు, కుళాయిలను పరిశీలించారు. అనంతరం ఇళ్లలో వాడుతున్న తాగునీటిని పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ఎల్.గణేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు ఆర్.ప్రసాద్, ఎస్.బలరామమూర్తి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అదిత్రి ప్రోగ్రాంపై అవగాహన సదస్సు

సఖినేటిపల్లి: గ్రామీణ మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అమరావతికి చెందిన స్టేట్ ప్రైవేటు యూనివర్సిటీ ఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కింద అదిత్రి ప్రోగ్రాంపై మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలో సఖినేటిపల్లిలంక, వీవీ మెరక గ్రామాల్లో ప్రాజెక్ట్ లీడ్ స్వాతి లేఖ, ప్రాజెక్ట్ మేనేజర్ రత్నకిషోర్ నేతృత్వంలో ఈ సదస్సులు జరిగాయి. మండల డీఆర్‌డీఏ ఏపీఎం విజయ్ సహకారంతో జరిగిన పై సదస్సుల్లో గ్రామీణ మహిళలకు వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించడం వంటి వాటిపై వారిద్దరూ మాట్లాడారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోండి

అంబాజీపేట: మండలంలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. ఈ ఆధార్ అప్‌డేట్‌లో పేరులో మార్పులు, చిరునామా, ఫొటో, ఫోన్ నంబర్లను సరిచేసుకోవచ్చన్నారు. 23న పుల్లేటికుర్రు 1, 2, చిరతపూడి, తొండవరం, 24న కె.పెదపూడి, ఇసుకపూడి, వాకలగరువు, 25న పసుపల్లి, మాచవరం 1, 2, నందంపూడి, 26న ముక్కామల, వక్కలంక, మాచవరం 3, 4, గంగలకుర్రు అగ్రహారం, 27న ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు గ్రామాల్లో ఉన్న సచివాలయాల వద్ద ఆధార్ అప్‌డేట్‌ను నిర్వహిస్తారన్నారు.



